

# కథా కౌముది

## జీవన్మరణాల సమతుల్యం     నవులూరి వెంకటేశ్వరరావు

"నాకు ఏమి తెలియదు అని తెలుసుకున్నాను" అన్నాడు.

సత్యాన్వేషణే సోక్రటీస్ మరణానికి దారితీసింది. చావు ఒడిని చేరడమే జీవితధ్యేయం అన్నట్టు జీవించాడు, ఇచ్చిన విషాన్ని పరమాన్నంలా తాగి అమరుడయ్యాడు. అతనికి బతుకు, చావు ఒకటే. డెబ్బై ఏళ్ళ అతని జీవితం సంఘటనా పూరితం. విచిత్రం ఏమిటంటే అతని మరణమే అతన్ని చిరంజీవిని చెయ్యడం. ఒక్క గ్రంథం కూడా తన తాత్త్వికత మీద రాయని తాత్త్వికుడు చరిత్రలో చిరస్థాయిగా నిలుచుండిపోవడం చిత్రం. పాశ్చాత్య తాత్త్విక ఆలోచనకు పితామహుడిగా పరిగణించబడుతున్నాడు. అతను బోధించిన దానికన్నా అతను జీవించిన విధానం, అతని నిజాయతీ, నైతిక వర్తనానికి ఇచ్చిన ప్రాధాన్యత, వెలిబుచ్చిన అభిప్రాయాలు [అతనిస్నేహితులు చెదురుమదురుగా గ్రంథస్తం చేసినవి], మత్యువును నిర్భీతితో, ప్రియురాలిలా ప్రేమగా కౌగలించుకోడం 2500/2400 ఏళ్ళ క్రితపు చెరపలేని చరిత్ర. రేఖామాత్రంగా తిరిగి అవలోకించే ప్రయత్నమిది.

పద్నాలుగువేల జనాభాగల గ్రీకునగరం/రాజ్యం ఏథెన్స్ లో ఒక తాపీ కార్మికుడికి, మంత్రసానికి జన్మించాడు. చప్పిడిముక్కు, మిటకరించిన గుడ్లు, బానకడుపు – అనాకారి.  చలికి, వేడికి ఒకే అంగీతో, కాళ్లకు చెప్పులు కూడా లేకుండా, మాట్లాడడానికి ఎవరు దొరుకుతారా, ఎక్కడ దొరుకుతారా అన్న అన్వేషణలో ఉన్నట్టు నగరంలో తిరుగుతుండేవాడు, ఎలాంటి శారీరక బాధా అతనికి పట్టేది కాదు. నళినీ దళం మీది జలబిందువు. సంపన్నకుటుంబం కాదు. సాధారణజీవితాన్ని ప్రేమించాడు. కొన్నాళ్ళు ఏథియన్  సైన్యంలో సైనికుడిగా పనిచేశాడు. మంచి యోధుడు. ముఖ్యమైన యుద్ధాలలో సూరత్వం చూపాడు. కాముకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాడు. ఆరోజులలో పురుషుల స్వలింగ సంపర్కం సాధారణ విషయం.

గ్జాంథిపి లాంటి గయ్యాళిని ఎందుకు పెళ్లి చేసుకున్నావు అని ఎవరో అడిగితే గుర్రాలను లొంగదీసుకోడంలో నైపుణ్యాన్ని సాధించాలనుకుకునేవాడు పొగరుబోతు గుర్రం ఎంపిక చేసుకుంటాడు అన్నాడు. ఆమెపేరు అర్థం పచ్చగుర్రం, తనకన్నా ఆమె నలభై ఏళ్ళు చిన్నది అంటారు, ఆలస్యంగా నలభై ఐదు–యాభై దగ్గిర పడుతుందనగా పెళ్లాడినట్టున్నాడు. 70వ ఏట ఆతను మరణించేసరికి ఆమె తన ముగ్గురు మగబిడ్డలలో ఒక శిశువును ఎత్తుకుని కారాగారానికి వచ్చింది. . కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడం లేదని, అనాకారి అని సోమరి అని, తనకన్నా పై వయసు అని కోపం ఉందేమో ఆమెకు. అతని పట్ల గయ్యాళీతనం చూపేది. ఒకసారి అతని నెత్తిమీద చల్లని నీళ్లు కుమ్మరించింది. ఉరిమిన మేఘం కురిసింది అని చమత్కరించాడు.

అతని తాత్విక దృష్టి, అతని జీవితం పాశ్చాత్య తాత్త్విక ప్రపంచం మీద గాఢమైన ముద్ర వేసింది. తాను బోధించడానికి ఏ బడినీ స్థాపించలేదు. అతనితో శిష్యులు అనదగిన స్నేహితులు తిరుగుతూ చర్చిస్తూ వుండేవాళ్ళు. ఏథెన్స్ కు ధర్మాన్ని బోధించడానికి దేవుడు తనను పంపాడని అది చెయ్యకుండా వైదొలగడమంటే దేవుడి ఆజ్ఞను ధిక్కరించడమనీ నమ్మాడు. నగర 'దివ్యవాణి' [ఆరకల్] అతను ఏథెన్స్ లో అందరికన్నా తెలివైనవాడనింది అంటారు. ఆ తెలివితేటలు కుట్రదారుల తెలివితేటలముందు పనికిరాలేదు, అతని మేధస్సుకేవలం మానవ శ్రేయస్సుకు అంకితమవటంవలన.

అతనంటే గిట్టనివాళ్ళు, అధికారవర్గం అతనిపై అతని పై ఆరోపణలు చేసి న్యాయస్థానానికి లాగారు. సోక్రటీజ్ భూమి క్రింది వాటిని, ఆకాశం పై వాటిని అధ్యయనం చేస్తున్నాడని, నాస్తికుడని, కొత్త దేవుళ్లను ప్రవేశపెట్టాడని, తన బోధనల ద్వారా యువకులను చెడగొడుతున్నాడని వాటి సారాంశం. అతను అప్పుడున్న ప్రజాస్వామ్యంలో చదువుకోనివారు పాలు పంచుకొని పాలించడాన్ని వ్యతిరేకించాడు. అదీ అతనిపై కక్ష పెంచుకోడానికి ఒక కారణం. ముక్కుసూటితనం నగరంలో ఎందరినో శత్రువులుగా చేసింది. అరిష్టోఫనెస్ అన్న ప్రసిద్ధ హాస్య నాటక రచయిత 'మబ్బులు' అన్న నాటికలో సోక్రటీజ్ ను ఒక పాత్రగా చిత్రించి నవ్వులపాలు చేశాడు. చాలామంది నగరవాసులను ఆ రచనలు ప్రభావితం చేసి సోక్రటీస్ ను చిన్నచూపు చూసేట్టు చేశాయి. అతని వాచాలతా అతనికి శత్రువులను కొనితెచ్చింది. న్యాయాస్థానం అతనికి మరణదండన విధించాలని అనుకున్నట్టులేదు. అతను న్యాయమూర్తుల అహం దెబ్బతినేలా మాట్లాడాడు. మరణ శిక్షను జరిమానా కట్టి లేక దేశం ఒదిలిపోవడం ద్వారా తప్పించుకోడానికి అవకాశం ఇచ్చారు. జరిమానా తన స్థాయికన్నా చిన్నదన్నాడు. తాను దానిని కట్టినా, దేశం ఒదిలిపోయినా తాను తప్పు చేసినట్టవు తుందన్నాడు. అతని ప్రధాన స్నేహితుడు క్రిటో సంపన్నుడు. అతను జైలు నుంచీ పారిపోవడానికి ఒక పథకం వేశాడు. సోక్రటీజ్ దాన్ని నిరాకరిస్తూ పౌరుడు బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నాడు. చావు ద్వారా శాశ్వతకీర్తిని ఆర్జించాలన్న కోర్కె అతనిలో ఉందా అన్నట్టు ప్రవర్తించాడు.

ప్లేటో అతని ముఖ్య స్నేహితులతో ఒకడు. తన 'సంభాషణలు' [డైలాగ్స్] లో చాలా విషయాలు సోక్రటీజ్ గురించీ రాశాడు. అందులో సోక్రటీజ్ తాత్త్వికత అని చెప్పినది ప్లేటో సొంతం అయివుండొచ్చు అని చాలామంది అభిప్రాయం. శరీరాన్ని ప్రేమించకూడదు. తాత్త్వికుడికి ధైర్యం అవసరం. ఒక పేరడాక్సును చెబుతాడు, చనిపోయేటప్పుడు విలపించడం అంటే జ్ఞానవంతుడు కానట్టు. జ్ఞానవంతుడు తన శరీరాన్ని, సంపదను ప్రేమించడు; అలా ప్రేమించేది సామాన్యుడు. సామాన్యుడు చావంటే భయపడతాడు. జ్ఞాని చావంటే భయపడడు ఎందుకంటే బ్రతుకులో కష్టనష్టాలంటే భయం కనుక; చావువలన అవి తొలగిపోతాయి కనుక చావు ద్వారా వాటిని తప్పించుకోవాలని చూడటమూ భయమే అవుతుంది – జ్ఞానిదైనా, సామాన్యుడిదైనా. బతుకు చావునుంచి, చావు బతుకు నుంచీ పుడతాయి. మెలకువ, నిద్ర ఒక దాని తరువాత ఒకటి వస్తవి. దానర్థం ఆత్మ ఉన్నట్టు. ఇంద్రియ పరిజ్ఞానం మనిషిని అంటిపెట్టుకుని ఉంటుంది. మన ఆ పరిజ్ఞానం మనతో పునర్జన అనంతరం కొనసాగుతుంది. పునర్జన్మ కర్మానుసారం ఉంటుంది. ఆత్మ దైవసమానం. దానికి చావులేదు. అర్థం చేసుకోగలదు, అందరిలో ఒకేలాంటిది, జీర్ణమయిపోదు, మార్పులు చెందదు – శరీరానికి విరుద్ధంగా ఉంటూనే. ఒకనాడు నేర్చుకున్నది, నేటి పరిజ్ఞానం ఎప్పుడూ ఉన్నట్టు లెక్క, ఇప్పుడు మనం చేస్తున్నదల్లా గతాన్ని. జ్ఞప్తికి తెచ్చుకోవడం. మనం పుట్టకముందే గతంలో మన జ్ఞానేంద్రియాలు సముపార్జించిన జ్ఞానం, పరిజ్ఞానం ఉంటాయి. ఆత్మ మధ్యలో ఎక్కడి నుంచో కొత్తగా వస్తుంటే ఇలా జరగదు. ఆత్మ చావు పుట్టుకలు లేనిది. తత్త్వవేత్త అధ్యయనం తన శరీరం, దాని ఆనందం గురించీ ఉండకూడదు, శరీరం, ఆత్మా వేరువేరు, చావు అంటే శరీరం నుంచీ ఆత్మ వేరవడం,ప్లేటో రాసినదానినిబట్టి చుస్తే అది భారతీయ తత్త్వానికి బాగా దగ్గిరగా ఉన్నట్టు తోస్తుంది. క్సేనఫన్ అనే మరో స్నేహితుడు సోక్రటీజ్ తాత్త్విక, నైతిక ఇతర జీవన దృక్పథానికి చెందిన అంశాలను తన 'మెమొరాబిలియా' లో తెలియజేశాడు.

అభియోగాలపై న్యాయ విచారణ జరిపి మూడు ప్రత్యామ్నాయాలు ఇచ్చారు: మరణదండన, దేశబహిష్కరణ లేక జరిమానా. జరిమానా కట్టడానికి డబ్బు పోగుచేయడానికి స్నేహితులు పూనుకోగా అలా చెయ్యడం వలన నేను నేరం చేసినట్టవుతుంది అని దానికి ఒప్పుకోలేదు. ఆ రోజులలో దేశ బహిష్కరణను మరణదండనతో సమానంగా భావించేవారు. అతను మరణించడానికి నిశ్చయించాడు బహిష్కరణ అయినా ఎక్కడో జీవించి ఉండటమే గనుక. ఆఖరుగా ఇలా అన్నాడు న్యాయస్థానంలో:

"మనం నిష్క్రమించవలసిన సమయం ఆసన్నమయింది; – నాకు చనిపోయేందుకు, మీకు జీవించడం కొనసాగించేందుకు; ఏది మెరుగైనది [చావా, బతుకా] అన్నది మనలో ఎవ్వరికీ తెలియదు దేముడికి తప్ప."

స్నేహితులు విలపించారు. వాళ్లలో ఒకడు ఆ శిక్షానిర్ణయాన్ని బిగ్గరగా తప్పుపట్టాడు. అతన్ని సోక్రటీజ్ సున్నితంగా మందలించాడు.

అది అమలు జరపడానికి ముప్పైరోజులపాటు జరిపిన ఆ రాజ్యపు పండగ అడ్డొచ్చింది. ఆ కాలమంతా మిత్రులతో మాట్లాడుతూ, ధ్యానం చేస్తూ కారాగారంలో సంతోషంగా గడిపాడు.

*మహాభినిష్క్రమణం*

కారాగారంలో అనేక వాదనలు జరిగాయి. అతను వివిధ విషయాల మీద అభిప్రాయాలను వెల్లడించాడు.

కాళ్ళ గొలుసులు అప్పుడే విప్పారు. అతని భార్య ముగ్గురు పిల్లలతో వచ్చింది, అందరికన్నాచిన్నవాడిని ఎత్తుకుని గట్టిగా విలపిస్తోంది. భార్యను తన కారణంగా పుట్టిన ముగ్గురు బిడ్డలను ఒదిలేస్తున్నానన్న బాధ ఏకోశానా కనబడలేదు.

దర్శనార్థం సోక్రటీజ్ స్నేహితులు కారాగారంలోకి వెళ్ళారు. తన మిత్రుడు క్రిటోతో ఆమెను ఇంటికి పంపించెయ్యమని చెప్పాడు. మంచం మీద కూర్చుని ఒక కాలు పైకి తీసుకుని ఒత్తుకోడం ఆరంభించాడు. మృత్యుముఖంలో మిత్రులు, అతని మధ్య జరిగిన సంభాషణా శైలికి ఈ దిగువది మచ్చు తునక:

"ఈ సౌఖ్యం వింతైనది. సౌఖ్యానికి, బాధకు వున్న సంబంధం పరస్పర వ్యతిరేకమైనది. ఒకదాన్ని మనిషి అనుభవించితే రెండోదాన్నీ అనుభవించక తప్పదు. ఆ రెండింటికీ సయోధ్యకుదిర్చే దైవ ప్రయత్నం విఫలమయి ఆయన ఒక దాని చివరను రెండోదానని చివరకు అంటించి ఒదిలాడు. నా కాళ్లకు వేసిన సంకెళ్లగొలుసులు ఒరుసుకుని నెప్పిచేశాయి. ఇలా మర్దనం చేసుకుంటుంటే సుఖంగా వుంది. ఏసోప్ [Aesop] కు ఈ విషయం తెలిసుంటే ఒక కథను అల్లుండేవాడు," అన్నాడు సోక్రటీజ్.

"నీవు అపోలో స్తోత్రం, ఏసోప్ కథలు రాశావు కదా ఈ కారాగారంలో. అంతకు ముందు నీవు ఇలాంటివి రాయలేదు. అవి రాయడంలో నీ ఉద్దేశం ఏమిటి? ఇవానస్ అడగమన్నాడు," సెటేస్ అన్నాడు.

"ఆ కవిని భయపడవద్దని చెప్పు. నేను అతనికి పోటీకి వెళ్లడం లేదు. నాకు సంగీతం నేర్వడం నెరవేరని కోర్కెగా మిగిలిపోయింది. దాన్నినెరవేర్చుకునే ప్రయత్నం చేశాను, అంతే. అతన్నినన్ను త్వరగా అనుసరించమను [చావులో] జ్ఞానవంతుడే ఐతే."

"ఆతను నీ సలహా పాటిస్తాడని నేను అనుకోను."

"ఐతే అతను తత్త్వవేత్త కాదా?"

"అవుననే అనుకుంటా," సిమ్మియం అన్నాడు.

"తత్త్వవేత్తే ఐతే ఆలోచనాపరుడవుతాడు, అపుడు మరణించాలని భావిస్తాడు. ఆత్మహత్య తప్పు కనుక ఆ పని చేసుకోడనుకుంటా."

అతనికి విషం అందియ్యబోయే మనిషి వచ్చాడు.

"ఇదివరకు ఇక్కడికి వచ్చిన వాళ్ళలాకాక నీవు ఉత్తముడివి, సౌమ్యుడివి. వాళ్ళలా నీవు నాపై కోపం తెచ్చుకోవనుకుంటా. నిన్ను నేరస్థుడిగా పరిగణించినవారు నిందార్హులు. కష్టాన్ని భరించగలిగినంతవరకు భరించు," అని ఏడుస్తూ వెళియాడు.

"నేరస్థులు యెంత సమయం వీలయితే అంత తీసుకుంటారు కదా నీవు ఎందుకు తొందరపడుతున్నావు అని ఒకస్నేహితుడు ప్రశ్నించాడు.

"వాళ్ళు ఎంత ఆలస్యంచేస్తే ఆ మేరకు జీవించవచ్చు అనుకుంటారు, నేను త్వరగా చావాలనుకుంటాను అన్నాడు సోక్రటీజ్.

క్రిటో చెప్పగా – ముందు వచ్చిన  వ్యక్తి విషం తెచ్చాడు. సోక్రటీజ్ సంతోషంగా స్వీకరించాడు. ఇంతవరకు నిగ్రహంతో వున్నస్నేహితులు ఏడవడం మొదలు పెట్టారు.

"మనషి ప్రశాంతంగా చావాలి; మీరు నిబ్బరంగా వుండండి."

అని పచార్లు చెయ్యడం మొదలుపెట్టాడు. కాళ్ళు బిగుసుకుపోవడం ఆరంభమయింది. అతను మంచం మీద కూర్చుని వాటిని నొక్కుకున్నాడు. విషం హృదయంవైపు పయనం సాగించింది. మొహం మీద కప్పుకున్న గుడ్డను తొలగించి అన్నాడు:

"క్రిటో, యా స్క్లి పియస్కు [ఒక దేముడు] నేను ఒక కోడిపెట్ట బాకీ వున్నా. ఆ బాకీ తీర్చడం మరిచిపోకు."

"ఆ పని చేస్తా. ఇంకేమైనా నేను చెయ్యవలసినవి ఉన్నాయా?"

సమాధానం లేదు. శరీరంలో కాస్త కదలిక వచ్చింది. మొహం మీది గుడ్డను తొలగించుకున్నాడు, కంటిచూపు స్థిరంగా ఉండిపోయింది. క్రిటో అతని నోరు, కనురెప్పలు మూసేశాడు.

ఆ విధంగా –

క్రీ.పూ. 470వ సంవత్సరంలో పుట్టిన 399లో నిష్క్రమించాడు అమరజీవి.

*[మూలాలు: 1. ఏ లైఫ్ అఫ్ సోక్రటీజ్, జి.పి. విగర్స్  2. ది ట్రయల్ అండ్ డెత్ అఫ్ సోక్రటీస్, పి.జె. చర్చ్  3. మరికొన్ని.]*

COMMENTS